సాక్షి ప్రకాశం

బుధవారం । 6 । మార్చి । 2024



షాదీఖానాపై పచ్చవిషం
ఒంగోలులో షాదీఖానాపై టీడీపీ తోకపత్రిక పచ్చవిషం కక్కింది. అసంపూర్తిగా ఉన్న షాదీఖానాను బాలినేని పూర్తిచేసి ప్రారంభించారు. - 8లో..



వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి
పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/25

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

పదో తరగతి హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో

ఒంగోలు: 2023–24 విద్యా సంవత్సరానికి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు సంబంధించిన హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల హాల్‌టికెట్లను సమగ్రంగా పరిశీలించి మీడియం, సబ్జక్టుల్లో ఏవైనా సవరణలు ఉంటే వెంటనే ప్రభుత్వ పరీక్షల సంచాలకులు తెలియజేయాలన్నారు.

నేడు ఏకేయూలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ల సమావేశం

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ల మీట్ 2024 నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని యూనివర్శిటీ గుర్తింపు పొందిన అన్ని కాలేజీల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, ఉన్నత విద్యాశాఖకు చెందిన రాష్ట్ర స్థాయి ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి విశిష్ట అతిథిగా హాజరవుతారన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కాలేజీల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

సీనియర్ ఇంటర్ ఆంగ్ల పరీక్షకు 918 మంది గైర్హాజరు

ఒంగోలు: సీనియర్ ఇంటర్ ఆంగ్ల పరీక్షకు మంగళవారం 918 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 16,456 మందికిగాను 15,854 మంది, ఒకేషనల్ విభాగంలో 2571 మందికిగాను 2255 మంది హాజరయ్యారు. మొత్తంగా 19,027 మందికిగాను 18,109 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 602 మంది, ఒకేషనల్ విభాగంలో 316 వెరసి 918 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. ఆర్‌ఐవో నాలుగు సెంటర్లను తనిఖీ చేయగా డీఈసీ సభ్యులు, జిల్లా పరిశీలకులు 7 సెంటర్లను, స్క్వాడ్ బృందాలు 45 సెంటర్లను తనిఖీ చేశారని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని ఆర్‌ఐవో వెల్లడించారు.

నీటి బిల్లులు విడుదల చేసిన ప్రభుత్వం

యర్రగొండపాలెం: నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేసిన ట్యాంకర్ల యజమానులకు మంగళవారం నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల మంజూరు కోసం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించారు. త్వరలో బిల్లులు మంజూరవుతాయని, గ్రామాల్లో నీటి తోలకాన్ని నిలిపి ప్రజలకు ఇబ్బంది పెట్టవద్దని ఆయన ట్యాంకర్ల యజమానులను కోరారు. బిల్లులు మంజూరు చేయడంలో ఆలస్యం అయితే తన సొంత నిధులతో బిల్లులు చెల్లిస్తానని ఆయన అనేక పర్యాయాలు హామీ ఇచ్చి గ్రామాల్లో నీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో పెండింగ్‌లో ఉన్న 2,045 బిల్లులకు గాను రూ.31.68 కోట్లను విడుదల చేయించిన చంద్రశేఖర్‌కు ట్యాంకర్ల యజమానులు కృతజ్ఞతలు తెలిపారు.


టెట్ పరీక్షలకు 39 మంది గైర్హాజరు

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) పరీక్షకు మంగళవారం 39 మంది గైర్హాజరయ్యారు. స్థానిక నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చెస్ యాక్షన్ ఇండియాలో మాత్రమే ఈ పరీక్ష జరిగింది. ఉదయం సెషన్‌లో 90 మందికి 65 మంది, సాయంత్రం సెషన్‌లో 92 మందికి 78 మంది మాత్రమే హాజరయ్యారని డీఈవో డి.సుభద్ర తెలిపారు.

సుజల ప్రకాశం

వైఎస్సార్ ఆశయాలకు ఊపిరి..

వెలిగొండ ప్రాజెక్టు దశాబ్దాల కల...ప్రకాశం, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాల ప్రజల సుదీర్ఘ స్వప్నం నేడు సాకారం కానుంది. నాడు తండ్రి వైఎస్సార్ ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనులు పూర్తి చేసి నేడు మూడు జిల్లాల ప్రజలకు అంకితం చేయనున్నారు. ఆసియాలోనే అతిపెద్ద నీటిపారుదల సొరంగాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అటు ప్రజకు, ఇటు రైతులకు పుష్కలంగా నీరందించనున్నారు. దీనిని పూర్తి చేయడం ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు సీఎం జగన్.



వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్



- నేడు వెలిగొండను జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్
- తండ్రి వైఎస్సార్ పనులను ప్రారంభిస్తే, తనయుడు వైఎస్ జగన్ పూర్తి చేశారు
- ప్రాజెక్టు నిధులు మింగేసిన చంద్రబాబు
- 3 జిల్లాల్లో 4.60 లక్షల ఎకరాలు సాగులోకి
- 30 మండలాల్లో 16 లక్షల మంది జనాభాకు సురక్షితమైన తాగునీరు
- రైతులు, ప్రజల్లో ఆనందాన్ని నింపిన జగన్

సాక్షిప్రతినిధి, ఒంగోలు: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేసి ప్రకాశం జిల్లాతో పాటు కడప, నెల్లూరు జిల్లాల ప్రజల దశాబ్దాల కల సాకారం చేద్దామని మహానేత డాక్టర్ వైఎస్ఆర్ వజ్ర సంకల్పంగా వెలిగొండ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. శ్రీశైలం నుంచి రోజుకు 11,584 క్యూసెక్కుల నీటిని తరలించటం ద్వారా 53.85 టీఎంసీల సామర్థ్యంతో నల్లమల సాగర్ ప్రాజెక్టును నిర్మించేలా రూపకల్పన చేశారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని వర్షాభావ ప్రాంతాల్లో 4.60 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 మండలాల్లోని 16 లక్షల మంది జనాభాకు తాగునీరు అందించే విధంగా ప్రాజెక్టు డిజైన్‌ను తయారు చేశారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి 2004 అక్టోబర్ 27న ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. జలయజ్ఞంలో భాగంగా రూ.5300 కోట్లతో అంచనాలతో పనులు ప్రారంభించారు. రూ.3,581.57 కోట్లు ఖర్చుచేసి ఐదేళ్ల కాలంలో 50 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. ఆయన అకాల మరణం తర్వాత పనులు మరుగున పడిపోయాయి. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు దీనిని ఏటీఎంగా వాడుకుని నిధులు మింగేశారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు నడుం బిగించారు. రివర్స్ టెండర్ల ద్వారా రూ.61.76 కోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టారు. రెండు టన్నెల్ పనులను పూర్తి చేసి ప్రకాశం పశ్చిమ ప్రాంతంతో పాటు వైఎస్ఆర్ కడప, నెల్లూరు జిల్లాల ప్రజల్లో ఆనందం నింపారు.

యుద్ధప్రాతిపదికన రెండు సొరంగాలు పూర్తి

మహానేత వైఎస్సార్ ఆశయాల సాధన దిశగా ఆవిర్భవించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి దుర్భిక్ష ప్రాంతాల ప్రజల ముఖాల్లో ఆనందం చూడాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగారు. నత్తనడకన సాగుతున్న రెండు టన్నెళ్ల నిర్మాణ పనులపై దృష్టి సారించారు. 57 నెలల పాలనలో కరోనా రెండు సంవత్సరాలు విజృంభించినా, ఆ మహమ్మారి కారణంగా పనులు చేయలేక పోయినా తరువాత పనులు ముమ్మరం చేశారు. మిగిలిన మొదటి సొరంగం పనులను 2019 నవంబర్‌లో ప్రారంభించారు. మొత్తం సొరంగం 18.800 కిలో మీటర్లు. అప్పటికే తవ్వగా మిగిలిపోయిన 2.883 కిలో మీటర్లు 2021 జనవరి 18 నాటికి పూర్తి చేయించారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి మొదటి సొరంగం ద్వారా నల్లమల సాగర్‌కు నీటిని తరలించి హెడ్ రెగ్యులేటర్ పనులను కూడా అదే ఏడాది పూర్తి చేయించారు. ఇక రెండో సొరంగం పనులు కూడా పూర్తి చేసి మూడు జిల్లాల ప్రజల్లో వెలిగొండ ప్రాజెక్టుపై ఉన్న ఆశలను చిగురింపజేశారు. ప్రాజెక్టు కోసం రూ.1,046.46 కోట్లు ఖర్చు చేశారు.



వెలిగొండ ప్రాజెక్టు

శిలాఫలకంతో సరిపెట్టిన చంద్రబాబు...

1996 సంవత్సరంలో అప్పటి లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ సంవత్సరం మార్చి 5వ తేదీన దోర్నాల వద్ద శిలాఫలకం వేశారు. ఆ తరువాత ప్రాజెక్టు పనులను సర్వే పేరుతో కాలయాపన చేసి కనీసం అందుకోసం నిధులు కూడా కేటాయించకుండా గాలికి వదిలేశాడు. ఆ తరువాత రెండోసారి ముఖ్యమంత్రి అయినా చంద్రబాబు ప్రాజెక్టు ఊసే పట్టించుకోలేదు. 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు చేపట్టారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం పోరాటాలు చేసిన కమ్యూనిస్ట్ నేత పూల సుబ్బయ్య పేరు వెలిగొండ ప్రాజెక్టుకు పెట్టింది కూడా వైఎస్ రాజశేఖర రెడ్డే. ఆ తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈ ప్రాజెక్టును అడ్డం పెట్టుకుని దోపిడీ పర్వానికి తెరతీశారు. దీనిని ఏటీఎంగా మార్చుకున్నారు. 2014 నుంచి 2019 వరకూ రూ.1,414.51 కోట్లు ఖర్చుచేసినా పనుల్లో ఏమాత్రం ప్రగతి కన్పించకపోవడం చంద్రబాబు దోపిడీకి నిదర్శనం. జీఓ–22 (ధరల సర్దుబాటు), జీఓ–63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు)ను వర్తింపజేసి.. కాంట్రాక్టర్లకు ఉత్తినే రూ.650 కోట్లకు పైగా దోచిపెట్టారు. అలాగే, 2017 నాటికే వెలిగొండను పూర్తిచేస్తామని ప్రకటించి.. టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్)ల మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లకు రూ.66.44 కోట్లను ఇచ్చేసి, కమీషన్లు వసూలుచేసుకున్నారు. 2018, 2019 నాటికి పూర్తిచేస్తామంటూ ఎప్పటికప్పుడు హామీలిస్తూ వచ్చిన చంద్రబాబు.. రెండో సొరంగం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించి, మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని పెంచి.. వాటిని అధిక ధరలకు సీఎం రమేష్‌కు కట్టబెట్టి, కమీషన్లు వసూలు చేసుకుని ప్రాజెక్టు పనులను గాలికి వదిలేశారు.

బాబు గాలికొదిలేస్తే..జగన్ పూర్తి చేశాడు..



రాష్ట్రాన్ని 14 సంవత్సరాలు పాలించిన చంద్రబాబు నాయుడు ఎంతో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టును గాలికొదిలేస్తే.. అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలోనే ప్రాజెక్టు పనులను వైఎస్ జగన్ పూర్తి చేశారు. వైఎస్సార్ ఆశయాలే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్ మూడు జిల్లాల ప్రజల దశాబ్దాల కలగా ఉన్న ఈ ప్రాజెక్టును పూర్తి చేసి చరిత్రలో నిలిచిపోనున్నారు.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే

వందేళ్ల కల సాకారమైంది



వందేళ్ల కల సాకారమైంది. దివంగత వైఎస్సార్ ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టును ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో పూర్తి చేసి చూపించారు. ప్రకాశం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చిన అపర భగీరథుడు జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు

మొక్కవోని ఆత్మవిశ్వాసంతో



ఎన్నో ఏళ్లుగా ప్రకాశం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ జాతికి అంకితం చేస్తుండటంతో ఎంతో ఆనందంగా ఉంది. మాట ఇస్తే తప్పడని మరోసారి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రుజువు చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా మొక్కవోని ఆత్మ విశ్వాసంతో ప్రాజెక్టును పూర్తి చేశారు.

– చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త

అనుక్షణం వెలిగొండపైనే ధ్యాస..



సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వెలిగొండ గురించి ప్రతి క్షణం ఆలోచిస్తూనే ఉండేవారు. చంద్రబాబు మాదిరిగా మోసపు మాటలు, హామీలు చెప్పటం తెలియదు. చెప్పిన మాట ప్రకారం పనులు చేసే ప్రభుత్వం మాది. ఐదేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేర్చారు.

– ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

భవిష్యత్‌కు బంగారు బాట..వెలిగొండ



వెలిగొండ ప్రాజెక్టు భవిష్యత్ తరాలకు బంగారు బాటవేస్తుంది. తీవ్ర కరువు కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంత ప్రజల కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టును ఏటీఎంగా వాడుకొని వదలేసింది.. అధికారంలోకి వచ్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టిపెట్టి పూర్తి చేయించారు.

– తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి

సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన బందోబస్తు

- ఎస్పీ పరమేశ్వరరెడ్డి
- సమర్థవంతంగా నిర్వర్తించేందుకు పోలీసు అధికారులకు పలు సూచనలు

పెద్దదోర్నాల: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగ నిర్మాణం పూర్తయిన సందర్భంగా ప్రాజెక్టును జాతికి అంకితం చేసేందుకు ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో హెలిపాడ్, వీవీఐపీ రూట్ బందోబస్తు, పైలాన్ ప్రదేశం, ఫొటో గ్యాలరీ, టన్నెల్ ప్రాంతం సమావేశం ప్రదేశాలను ఎస్పీ పరమేశ్వర రెడ్డి, భద్రతా సిబ్బందితో కలిసి పలు సూచనలు చేశారు. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. బందోబస్తు విధులతో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది వారికి సెక్టార్ వారీగా విధులు కేటాయిస్తారన్నారు.



పైలాన్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ

ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన స్థలానికి నిర్దేశించిన సమయానికి విధులకు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. వీవీఐపీ, వీఐపీల వాహనాలను కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ చేయించాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్ల వద్ద అప్రమత్తంగా మెలగాలని అన్నారు.

సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్:
ఎస్పీ పరమేశ్వరరెడ్డి ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు సంబంధించి ట్రయల్ రన్ నిర్వహించారు. కాన్వాయ్ వెళ్లే మార్గంలో ఆటంకాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బందోబస్తు కోసం ముగ్గురు ఏఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 26 మంది సీఐలు, 62 మంది ఎస్సైలు 138 మంది ఏఎస్సైలు, 324 మంది కానిస్టేబుళ్లు, 53 మంది మహిళా పోలీసులు, హోంగార్డులు, ఆర్ ఎస్సై, ఏఆర్ఎస్సై, ఏఎస్ఎస్, ఎఆర్‌హెచ్‌సీలు, ఏపీఎస్‌పీలు కలిపి మొత్తంగా 885 మంది సిబ్బంది, మరో 16 స్పెషల్ పార్టీలను ముఖ్యమంత్రి పర్యటనకు నియమించినట్లు ఆయన తెలిపారు.

సీఎం పర్యటన ఇలా..

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం గం.9.40కి తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో ప్రకాశం జిల్లా పర్యటనకు బయలుదేరుతారు.
- గం.10.30కు పెద్దదోర్నాల మండలం ఎగువచెర్లోపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు.
- అక్కడ గం.10.40 వరకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడతారు.
- గం.10.40కు రోడ్డు మార్గంలో ఎగువచెర్లోపల్లిలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ వద్దకు బయలుదేరి గం.10.43కు చేరుకుని.. గం.10.50 వరకు వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన ఫొటోలను తిలకిస్తారు.
- ఫొటోగ్యాలరీ నుంచి ప్రాజెక్టు పైలాన్ వద్దకు చేరుకుని గం.10.52కు పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం ప్రాజెక్టు వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు.
- అనంతరం గం.10.55 నుంచి గం.11.10 వరకు వెలిగొండ ప్రాజెక్టు లబ్ధిదారులతో మాట్లాడతారు.
- గం.11.10కు వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్–2 సందర్శించేందుకు బయలుదేరుతారు.
- గం.11.15కు టన్నెల్ –2కు చేరుకుని గం.11.25 వరకు దానిని పరిశీలిస్తారు.
- గం.11.25కు టన్నెల్–2 నుంచి ఎగువచెర్లోపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు బయలుదేరుతారు.
- గం.11.30కు హెలిపాడ్‌కు చేరుకుంటారు. గం.11.35కు హెలికాప్టర్ టేక్‌ఆఫ్ అయి తాడేపల్లికి బయలుదేరుతుంది.
- గం.12.25కు తాడేపల్లికి చేరుకుంటారు.

నిరుపేదకు రూ.10 లక్షల ప్రాపర్టీని ఇస్తున్నాం

- ఆ ప్లాటులో రెండు, మూడు అంతస్తులైనా వేసుకోవచ్చు
- పేదల ప్లాట్ల విషయంలో టీడీపీ నాయకులు అడ్డుపడుతూనే ఉన్నారు
- ఈ రోజు హైకోర్టులో కేసు వాయిదా ఉంది

ఒంగోలు సబర్బన్: ఇళ్లులేని నిరుపేదకు సొంతింటి కల సాకారం చేయటంతో పాటు ప్లాటు, ఇళ్లు ఇవ్వడం ద్వారా రూ.10 లక్షల ప్రాపర్టీని ఇస్తున్నట్లు అవుతుందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన నగరంలోని ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వరుసగా రెండో మంగళవారం కూడా చేపట్టారు. నగరంలోని ఎనిమిది డివిజన్లలో వరుసగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందు బాలినేని శ్రీనివాస రెడ్డి, శచీదేవి దంపతులు పంపిణీ చేస్తుంటే వారి వెంటనే యువనేత, బాలినేని తనయుడు ప్రణీత్ రెడ్డి, శ్రీ కావ్య దంపతులు మిగతా అందరికీ పంపిణీ చేసుకుంటూ ముందుకు సాగారు. మొత్తం మీద ఎనిమిది డివిజన్లలో కలిపి 3,280 మంది లబ్ధిదారులకు రెండో రోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని సొంత ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల పట్టా ఇచ్చి సొంత ఇల్లు నిర్మించి ఇద్దామన్నదే తన ప్రధాన ఆలోచనగా పెట్టుకున్నానన్నారు. అందుకే ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి పట్టా ఇస్తే తప్ప 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను అని గతంలో ప్రకటించానని గుర్తు చేశారు. రానున్న ఎన్నికలు తనకు చివరి ఎన్నికలని, అందుకోసం నియోజకవర్గ ప్రజలు వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. మొత్తం ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అయితే గతంలో ఇందిరమ్మ ఇళ్లు మాదిరిగా కాదని, ప్రస్తుతం ఇస్తున్న ప్లాటులో రెండు, మూడు అంతస్తులైనా వేసుకోవచ్చన్నారు. పేదలకు ప్లాట్లు విషయంలో టీడీపీ నాయకులు అడ్డుపడుతూనే ఉన్నారని, బుధవారం ఈ ప్లాట్ల విషయంలోనే హైకోర్టులో వాయిదా ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి న్యాయవాదులు పోరాడుతున్నారన్నారు. వరుసగా త్రోవగుంటలో మొదలు పెట్టిన పట్టాల పంపిణీ సాయంత్రం వరకు సాగుతూనే ఉంది. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే విషయంలో వాసన్న అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. తామిద్దరం జగనన్న అడుగులో అడుగులు వేసేవాళ్లమేనన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తూనే ఉంటారని, రానున్న 45 రోజుల్లో ఇంకా ఎక్కువగా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.జశ్వంతరావు, 1వ డివిజన్ కార్పొరేటర్ కోటపూరి సామ్రాజ్యం, 50వ డివిజన్ అంబటి ప్రసాదు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, కట్టా గోపి, పట్నం సింగయ్య, రాయపాటి అంకయ్య, తేళ్ళపల్లి ధనలక్ష్మి, దాసు వెంకట్రావు, సూదనగుంట రామకృష్ణా రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇంటి పట్టా, దుస్తులు పంపిణీ చేస్తున్న బాలినేని దంపతులు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి

క్లుప్తంగా

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు టౌన్: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు. రాష్ట్రంలోని నైపుణ్య శిక్షణా కేంద్రాలను విశాఖ పట్టణంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఒంగోలు ప్రభుత్వ బాలుర, బాలికల ఐటీఐ కళాశాలల ప్రాంగణంలో నిర్మించిన నైపుణ్య అభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాలంతో పాటు పరిగెట్టిన వారే విజయం సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ఏడీఎస్‌డీఈ ఎం. శ్రీను, హెచ్‌ఆర్ ఎంఐఎస్ ఇ. శ్రీనివాసచారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ బాష, నాన్ టెక్నికల్ ఆఫీసర్ సాయి ప్రణీత, కో ఆర్డినేటర్లు అనూష, విద్యా సాగర్, రెహమాన్, రమేష్, ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరదేవి తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానాపై పచ్చ విషం

- దివంగత వైఎస్సార్ హయాంలో ఒంగోలుకు షాదీఖానా మంజూరు
- రూ.75 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించిన వైనం
- టీడీపీ జమానాలో విదిల్చింది రూ.1.50 కోట్లు
- మొత్తం నిర్మాణ వ్యయం రూ.5.94 కోట్లు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన ఖర్చు రూ.3.69 కోట్లు
- ఆంధ్రజ్యోతి అడ్డగోలు రాతలపై ముస్లిం మైనారిటీల ఆగ్రహం


పూర్తి స్థాయి మౌలిక వసతులతో నిర్మించిన షాదీఖానా భవనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు షాదీఖానాపై టీడీపీ తోక పత్రిక విషం కక్కింది. ఒంగోలు నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద అసంపూర్తిగా నిలిచిన షాదీఖానాను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గత నాలుగేళ్ల పదినెలల్లో రూ.3.69 కోట్లు వెచ్చించి పూర్తి చేశారు. టీడీపీ హయాంలో ప్రారంభించిన దాన్ని మళ్లీ.. మళ్లీ ప్రారంభిస్తున్నారంటూ తోక పత్రిక మంగళవారం అసత్య కథనాన్ని వండివార్చింది. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వంలో ముస్లింలను మభ్యపెట్టేందుకు మొండి గోడలతో ఉన్న షాదీఖానాకు దామచర్ల జనార్దన్ రిబ్బన్ కత్తిరించి డూప్ షో చేశారు. దానిని పట్టుకుని అడ్డగోలుగా కథనం ప్రచురించిన తోక పత్రికను ముస్లింలు ఈసడించుకుంటున్నారు.

ఇవిగో వాస్తవాలు..

■ నగరంలోని 24వ డివిజన్ కొత్త కూరగాయల మార్కెట్ వద్ద షాదీఖానా నిర్మాణానికి 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎకరం స్థలం కేటాయించారు. భవనం నిర్మాణం కోసం రూ.75 లక్షలు మంజూరు చేశారు. అప్పట్లో స్థలం బాగు చేసి, పునాది నిర్మించి, పిల్లర్లపై శ్లాబు వేశారు.

■ వైఎస్సార్ అకాల మరణం తర్వాత రాజకీయ పరిణామాలు అందరికీ తెలిసినవే. కాంగ్రెస్‌లో ఇద్దరు ముఖ్యమంత్రులు మారడం, బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌ను వీడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలోకి వెళ్లడం అందరికీ తెలిసిందే.

■ ఆ తరువాత 2014–19 మధ్యలో టీడీపీ జమానాలో రూ.1.50 కోట్లు అప్పటి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మంజూరు చేయించారు. ఆ నిధులతో గ్రౌండ్ ఫ్లోర్ కూడా పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు.

■ 2022–23లో న్యూ టాయ్‌లెట్స్, కిచెన్ బిల్డింగ్ వర్క్స్, విద్యుదీకరణ కోసం రూ.40 లక్షలను ఒంగోలు నగర పాలక సంస్థ జనరల్ ఫండ్ నుంచి బాలినేని ఇప్పించారు.

■ 2022–23లో షాదీఖానా భవనం బయట ఓపెన్ కిచెన్, సర్వీసు రూమ్, పార్కింగ్ టైల్స్ కోసం ఒంగోలు నగర పాలక సంస్థ జనరల్ ఫండ్ నుంచి రూ.40 లక్షలు బాలినేని ఇప్పించారు.

■ 2023–24లో భవనం బయట పాత్ వేస్, హ్యాండ్ వాష్ బేసిన్లు, పెయింటింగ్, హ్యాండ్ రెయిలింగ్ నిర్మాణానికి జనరల్ ఫండ్స్ నుంచి మరో రూ.80 లక్షలు ఇప్పించారు.

■ గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి కావడానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఐదోసారి ఎమ్మెల్యే అయిన తరువాత రూ.1.60 కోట్లు ఇప్పించారు.

■ మొదటి అంతస్తు కోసం 2022–23 సాధారణ నిధుల నుంచి మళ్లీ రూ.68.60 లక్షలు మంజూరు చేయించారు.

■ తిరిగి 2023–24 జనరల్ ఫండ్ నుంచి హెడ్ రూమ్, వాటర్ ట్యాంకర్ కోసం రూ.10 లక్షలు మంజూరు చేయించారు.

■ 2023–24లో ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ మిగిలిపోయిన పనులు పూర్తి చేయడానికి జనరల్ ఫండ్ నుంచి రూ.40 లక్షలు మంజూరు చేయించారు.

■ మళ్లీ 2023–24 సంవత్సరంలో జనరల్ ఫండ్ నుంచి సీలింగ్, ప్లాస్టరింగ్, ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ ప్లాస్టరింగ్, తలుపులు, కిటికీల కోసం రూ. 40 లక్షలు మంజూరు చేయించారు.

■ 2023–24లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎంపీ ల్యాండ్ నుంచి రూ.50 లక్షలు విడుదల చేయడంతో పాత్‌వేస్, హ్యాండ్ వాష్ స్టెప్స్, పెయింటింగ్, హ్యాండ్ రెయిలింగ్ కోసం ఖర్చు చేశారు.

ఈ నిజాలను మరుగుపరిచిన తోక పత్రిక.. దామచర్ల చేసిన డ్రామాను అడ్డగోలుగా అక్షరబద్ధం చేసిన తీరును ముస్లిం మైనారిటీలు తూర్పారపడుతున్నారు.

సోది రాతలు సిగ్గుచేటు


షాదీఖానా ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని, ఒంగోలు పార్లమెంట్ కన్వీనర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న ముస్లింలు

- షాదీఖానా ముందే ప్రారంభిస్తే ఒక్క షాదీ కూడా ఎందుకు చేయలేదు?
- తోక పత్రిక రాతలు, టీడీపీ నేతలపై నిప్పులుచెరిగిన ఎమ్మెల్యే బాలినేని
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డితో కలిసి షాదీఖానా ప్రారంభం

ఒంగోలు సబర్బన్: మొండి గోడల మీద ఎవరైనా షాదీఖానా భవనాన్ని ప్రారంభిస్తారా..? ప్రారంభిస్తే ఇప్పటి వరకూ ఒక షాదీ అయినా అక్కడ చేసుకున్నారా అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి టీడీపీ నేతలను నిలదీశారు. షాదీఖానా ప్రారంభోత్సవాన్ని పలుచన చేస్తూ తోక పత్రిక కథనం ప్రచురించడంపై బాలినేని నిప్పులు చెరిగారు. ఒంగోలులోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద నిర్మాణం పూర్తయిన షాదీఖానాను వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి బాలినేని లాంచనంగా ప్రారంభించారు. ముస్లిం మైనారిటీలకు షాదీఖానాను అంకితం చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. షాదీఖానా విషయంలో పచ్చ మీడియా ఇష్టం వచ్చినట్లు రాతలు రాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతి అడ్డగోలు రాతలకు టీడీపీ నాయకులు వంతపాడటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ హయాంలో ఎకరా స్థలం, రూ.75 లక్షలు మంజూరు చేశారని గుర్తు చేశారు. షాదీఖానా నిర్మాణంలో జాప్యానికి కారణాలు, పూర్తి చేసేందుకు తాను చేసిన కృషి ఏమిటో ముస్లింలకు తెలుసన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.3.69 కోట్లు ఖర్చు చేసి షాదీఖానాను పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. ముస్లింలకు ఎంతో చేశానంటున్న దామచర్ల కరోనా సమయంలో ఎక్కడ దాక్కున్నాడో చెప్పాలని నిలదీశారు. పచ్చ పత్రికలు ఇష్టారీతిగా కథనాలు రాస్తే సహించేది లేదని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ.. ఒంగోలులో నిర్మించిన షాదీఖానా సువిశాలంగా ఉందని కితాబిచ్చారు. ఎన్ని రూ.కోట్లు ఖర్చయినా వెరవకుండా పూర్తి చేశారని బాలినేనిని కొనియాడారు. ముస్లింలకు మహానేత వైఎస్సార్ 4 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ.. ముస్లింల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరిందన్నారు. కాగా షాదీఖానా స్థలంలోనే మసీదు నిర్మించుకుంటామని ముస్లిం పెద్దలు కోరగా అవసరమైన విధంగా స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాలినేని భరోసా ఇచ్చారు. ముస్లిం నాయకులు జలీల్, మున్నా, స్థానిక కార్పొరేటర్ బేతంశెట్టి శైలజతో పాటు పలువురు ముస్లిం కార్పొరేటర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

నాలుగేళ్ల పది నెలల పాలనలో రైతు పక్షాన నిలిచిన వైఎస్ జగన్ సర్కార్

- ప్రకృతి వైపరీత్యాల సమయంలో అన్నదాతకు అండగా..
- గత 58 నెలల్లో పంట నష్టపోయిన 1,87,691 మంది రైతులకు రూ.149.2 కోట్ల పరిహారం
- మిచాంగ్ తుఫాన్ బాధిత రైతులు 3,775 మందికి రూ.2.82 కోట్లు
- నేడు తాడపల్లి నుంచి డీబీటీ ద్వారా నిధులు విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్
- టీడీపీ జమానాలో రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన చంద్రబాబు
- ఇరువురి పాలనను బేరీజు వేసుకుంటున్న రైతన్నలు


నాగులుప్పలపాడు సమీపంలో దెబ్బతిన్న మిరపను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్(ఫైల్)

హలధారులకు బలం

ఒంగోలు సెంట్రల్: ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో పరిహారం అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. గడిచిన నాలుగున్నరేళ్లలో ఇదే పద్ధతిలో బాధిత రైతుల పక్షాన నిలిచింది. ఖరీఫ్ సీజన్‌లో మొన్నటి మిచాంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలకు కూడా సీజన్ ముగియకుండానే పరిహారాన్ని మంగళవారం రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధమైంది. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా తూర్పు ప్రాంతంలో రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లింది. తుఫాన్ వెలిసిన వెంటనే పంట నష్టం వివరాల లెక్క తేల్చేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో వడివడిగా పనిచేశారు. ఏ మండలంలో, ఏ గ్రామంలో ఏ పంట ఎంత దెబ్బతిన్నదో తెలుపుతూ రైతుల వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో పొందుపరిచారు. వీరికి నష్టపరిహారాన్ని మంగళవారం సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా డీబీటీ ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

రైతుల హర్షాతిరేకాలు

సీజన్ దాటక ముందే పంట నష్ట పరిహారాన్ని రైతులకు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికార యంత్రాగానికి కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. 2019 ఆగస్టు, అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు, 2020 జనవరి, ఫిబ్రవరి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్లో కురిసిన వర్షాలు, నివార్ తుఫాన్ నష్టాలకు, 2022 డిసెంబర్‌లో సంభవించిన మాండూస్ తుఫాన్, 2023 మార్చిలో అకాల వర్షాలకు సంభవించిన నష్టాలపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేగంగా స్పందించి ఇన్‌పుట్ సబ్సిడీ అందించింది. తాజాగా మిచాంగ్ తుఫాన్ బాధిత రైతులకు పరిహారం అందిస్తోంది.

గత 58 నెలల్లో రైతులకు అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలు

ఏడాది	పంట నష్టపోయిన రైతులు	ఎకరాలు	పరిహారం (రూ.లక్షల్లో)
2019	1510	2,197.4	55.49
2020	1,34,623	2,30,876.05	10,338.12
2021	18,715	29,966.82	1,647.57
2022	28,727	63,147.08	2,563.41
2023	341	606.52	34.77
2023 మిచాంగ్	3,775	4,975.9	282.32
మొత్తం	1,87,691	3,32,215.72	14,921.67

జగన్ పాలనలో రైతులకు పండగ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రైతులు ఎంతో ధైర్యంగా వ్యవసాయం చేశారు. పండితే పంట ఇంటికి వస్తుంది, ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటకు నష్టం కలిగితే ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని రైతులు బలంగా నమ్మారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవడంతోపాటు ఉచిత పంటల బీమాను అమలు చేయడంతో వ్యవసాయం పండగలా మారింది.

– మారెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు


టంగుటూరు : మర్లపాడులో దెబ్బతిన్న మినుమును పరిశీలిస్తున్న జేడీఏ(ఫైల్)

రైతులకు ఎప్పటికప్పుడు పరిహారం



గత నాలుగున్నరేళ్ల కాలంలో అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు రైతులకు సరైన సమయంలో ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా చేయూత ఇచ్చి ఆదుకుంది. ప్రస్తుత ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో జిల్లాలో 1,87,691 మంది రైతులకు రూ.149.2 కోట్ల పరిహారం అందించింది. మిచాంగ్ తుఫాన్ ఇన్‌పుట్ సబ్సిడీ సైతం మంగళవారం సీఎం నేరుగా రైతుల ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేయనున్నారు.

– ఎస్.శ్రీనివాసరావు, జేడీఏ ఒంగోలు

రేపు కొండపిలో మెగా జాబ్‌మేళా

కొండపి(మర్రిపూడి): కొండపి మండల కేంద్రంలోని సీతారామ కళ్యాణ మండపంలో గురువారం ఉదయం 9.30 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబ్‌మేళాను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నారన్నారు. జాబ్‌మేళాలో 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, 3 వేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి రెండో దశ పొగాకు వేలం

ఒంగోలు సెంట్రల్: 2024 ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా(ఎఫ్‌సీవీ) పొగాకు వేలం బుధవారం మరో తొమ్మిది కేంద్రాల్లో ప్రారంభిస్తున్నట్లు టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. దక్షిణాదిలో వేలం కేంద్రాలైన ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి, కందుకూరు-1,2, కలిగిరి, డీసీపల్లిలో వేలం ప్రారంభమవుతుందని వివరించారు. ఒంగోలు-1, కొండపిలో ఇప్పటికే వేలం ప్రారంభించినట్లు చెప్పారు. ఒంగోలు-2, వెల్లంపల్లి కేంద్రాల్లో పొగాకు వేలాన్ని బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రంలో ఇంటర్ విద్యార్థికి అస్వస్థత

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాసి బయటకు వస్తుండగా అమర్నాథ్ రెడ్డి అనే విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్పందించిన ఉపాధ్యాయులు సుబ్బారావు, లక్ష్మీనారాయణ, పీఈటీ రాముడు తమ కారులో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు జాస్మిన్, మధుశంకర్ ప్రథమ చికిత్స చేయడంతో కొంతమేర కోలుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి దర్శిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

బీసీ హాస్టళ్ల టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

● జిల్లా బీసీ సంక్షేమాధికారి అంజల

ఒంగోలు సెంట్రల్: బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి ఎం.అంజల సూచించారు. ఓల్డ్ రిమ్స్‌లోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో మంగళవారం బీసీ హాస్టళ్ల వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమాధికారి మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో స్లో లెర్నర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఇప్పటికే బీసీ రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు గత డిసెంబర్ నుంచి ప్రతి వారం జూమ్ మీటింగ్ ద్వారా విద్యార్థుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. 'నూటికి నూరు శాతం సాధిద్దాం' అనే నినాదంతో ప్రతి సంక్షేమ అధికారి కృషి చేయాలని కోరారు. సహాయ బీసీ సంక్షేమాధికారి కె.శ్రీనివాసులు, షేక్ బజ్బార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్టార్ క్యాంపెయినర్లు మహిళలే..

- సంక్షేమ పథకాల్లో మహిళలకే అత్యధిక ప్రాధాన్యత
- చంద్రబాబు బూటకపు హామీలను ఎండగడదాం
- వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత

ఒంగోలు: మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్ పెద్ద పీటవేశారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన జగనన్నకు స్టార్ క్యాంపెయినర్లు మారి, వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్, సావిత్రీభాయి పూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ సునీత మాట్లాడుతూ.. నాలుగేళ్ల పది నెలల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల్లో అక్కచెల్లెమ్మలకే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాజకీయంగా కూడా మహిళలకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో 50 శాతం కంటే ఎక్కువ పదవులను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళల రక్షణకు దిశ చట్టం ద్వారా భద్రత కల్పించడంతోపాటు దిశ పోలీసు స్టేషన్లు ఏర్పాటుచేసి, మహిళా పోలీసులను నియమించి అండగా నిలిచారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాలు దాటినా మహిళలకు ఇంత భారీగా అవకాశాలు ఏ ప్రభుత్వంలోనూ దక్కలేదన్నారు. జగనన్న పాలనలోనే రూ.2 లక్షల కోట్లకు పైగా నగదు పేదలకు నేరుగా అందిందన్నారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను ఎండగట్టేందుకు మహిళలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకోసం సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకుందామన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి మాట్లాడుతూ పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న ప్రస్తుత యుద్ధంలో మహిళల సత్తా ఏమిటో చూపిద్దామన్నారు. రానున్న 45 రోజులపాటు కష్టపడదామని దిశానిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి అధ్యక్షత వహించిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంది ప్రమీలారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డి అరుణ, తమ్మినేని సుజాతారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలాకుమారి, జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, నగర అధ్యక్షురాలు చింతగుంట్ల సువర్ణ పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, మహిళా నాయకులు

వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారం


బూచేపల్లికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

● డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: 2024లో అధికారంలోకి వచ్చేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 175 సీట్లకు 175 సీట్లు గెలిచి క్లీన్ స్వీప్ చేస్తారని దర్శి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఐదో వార్డులో మన ఊరు మన శివన్న కార్యక్రమం వార్డు కౌన్సిలర్ తుళ్లూరి బాబూరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలకు ఘన స్వాగతం పలికారు. గడప గడపలో వారి యోగక్షేమాలు అడుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. ఎస్సీ కాలనీలో చిన్న టిఫిన్ హోటల్ వద్ద వెంకాయమ్మలు దోశలు పోయగా శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వాటిని ఆరగించి కాలనీ వాసుల్లో ఉత్సాహాన్ని నింపారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, ఎంపీపీ సుధాఅచ్చయ్య, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కేవీ రెడ్డి, సాగర్ ప్రాజెక్టర్ మాజీ వైస్ చైర్మన్ సద్ది పుల్లారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడు బండి గోపాల్, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగనన్నాథం మోహన్‌బాబు, ఆవుల జ్యోతి శివారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కొడవటి జాన్, సామ్యేల్, వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి సుశీలా ప్రతాప్, కిషోర్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నపూస బాపిరెడ్డి, ముస్లిం ఫెడరేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు సాదాగర్ రహమ్‌తుల్లా, భాస్కర్, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి మునలయ్య, మాజీ వైస్ ఎంపీపీ మారం శ్రీనివాసరెడ్డి, పుట్ట రవి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానుల పాల్గొన్నారు.